క్లుప్తంగా

శాశ్వత కార్యదర్శిని నియమించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల: మండలంలోని గంగాసాగర్ గ్రామానికి శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉప్పలి మల్కయ్య కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి ప్రత్యేకంగా కార్యదర్శి లేకపోవడంతో అభివృద్ధి, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ సరిగ్గాలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నర్సింలు, జగన్నాథం, మల్లేశ్, బలవంతు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: రాఘవేంద్రస్వామివారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పట్టణంలోని స్వామివారి ఆలయంలో ఉదయం సుప్రభాతం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. అనంతరం శ్రీస్వామివారిని ఊరేగించారు. మహిళలు శ్రీస్వామివారికి మంగళహారతులు అందిస్తూ, భజనలు చేస్తూ, పాటలు పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ డీడీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, మురారి వశిష్ఠ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల గొంతుక పీఆర్టీయూ



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఐక్యతను కాపాడుతూ గొంతుకగా పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందని ఆసంఘం మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట సీపీఎస్, జీయూపీఎస్, మెట్లకుంట, బురాన్‌పూర్, బొట్లోనితండా, నాగిరెడ్డిపల్లి, చౌదర్‌పల్లి, మదన్‌పల్లి తదితర గ్రామాల్లో పీఆర్టీయూ సభ్యత్వం నమోదు చేశారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ సంఘం సభ్యత్వంపై ఆసక్తిగా ఉన్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా తమ సంఘానికి ఆదరణ ఉందన్నారు. సభ్యత్వ నమోదులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, జిల్లా కౌన్సిలర్ శశిధర్, మండల గౌరవాధ్యక్షుడు కాశీపతి తదితరులున్నారు.

వర్గీకరణ పేరుతో రాజకీయాలు చేయొద్దు



పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

కుల్కచర్ల: వర్గీకరణతో వెనుకబాటు వర్గాల ప్రజలకు ఇబ్బందికరమని మాల మహానాడు నాయకులు, దళిత ప్రజాజ్యోతి సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలో భారత్ బంద్‌లో భాగంగా పాఠశాలను బంద్ చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొందరు వర్గీకరణ పేరుతో అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణతో మాల సామాజికవర్గం, ఇతర వర్గాలను విభజించడమే అవుతుందన్నారు. ప్రభుత్వాలు విభజన రాజకీయాలు చేయరాదని.. అలా చేస్తే మరొక ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆంజనేయులు, జంగయ్య, వెంకటయ్య, రాములు, ఈశ్వరయ్య, యాదయ్య, సందీప్, మహేశ్, వెంకటేష్, విష్ణు, సాయిలు పాల్గొన్నారు.

అరకొర ఎరువులు..
అన్నదాత వెతలు

చాలీచాలక రైతుల ఇబ్బందులు



ఆటోలో తరలిస్తున్న ఎరువుల బస్తాలు



పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం వద్ద బారులు తీరిన రైతులు

పెద్దేముల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా ఎరువులు సమస్య తీరటం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం పెద్దేముల్ రైతుసేవా సహకార సంఘంలో అరకొర ఎరువులు అందించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలో నిల్చుంటే ఐదుఎకరాలకు నాలుగు బస్తాలు ఇస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. గత మూడేళ్ల నుంచి ఎరువుల సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం రైతుల గోస పట్టించుకోకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యంగా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో ఇష్టం వచ్చిన ధరలకు విక్రయాలు చేస్తున్నా.. అడిగే వారు లేరని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్క రుపాయి అధిక ధరకు విక్రయించొద్దని ఉన్నతాధికారులు ఆదేశించినా వ్యవసాయ అధికారుల అండదండలతో ఎరువులు, విత్తనాలు ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. పెద్దేముల్ రైతు సేవా, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయాలు చేసినా తగినంత అందుబాటు లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌కు మందులు, ఎరువులు, విత్తనాల కొరత లేదు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు గొప్పలు చెప్పడం తప్ప చేసిందేమి లేదని అన్నారు. ప్రస్తుతం పత్తి, కంది, వరి, చెరుకు పంటలకు యూరియా అవసరం ఉంది. కనీసం ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల వరకు అవసరం ఉంటుందని రైతులు అంటున్నారు. మార్కెట్లో 45 కిలోల యూరియా బస్తా రూ.270, డీఏపీ రూ.1350 విక్రయాలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా.. కొంతమంది ఎరువుల దుకాణాలు యజమానులు యూరియా రూ.320 నుంచి రూ.330లకు, డీఏపీ 1450 వరకు విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయమై మండల రైతులు ప్రతి ఏటా ఫిర్యాదులు చేసినా ఎలాంటి లాభం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎకరాకు ఐదు బస్తాలు తగ్గకుండా ఎరువులు అందచేయాలని రైతులు కోరుతున్నారు. ఎరువుల విషయమై పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం సీఈఓను వివరణ కోరగా మళ్లీ ఎరువులు రాబోతున్నాయని అన్నారు. ఒక రోజు ఆసల్యమయిన ఎరువులు ప్రతి రైతుకు అందజేస్తామని జరుగుతుందని సీఈఓ మరళీగౌడ్ వివరించారు.

ముదిరాజ్ భవన నిర్మాణమే లక్ష్యం

సంఘం ప్రతినిధులు



మాట్లాడుతున్న ఉత్తంచంద్ తదితరులు

యాలాల: నియోజకవర్గస్థాయిలో ముదిరాజ్‌లకు భవనంనిర్మించడమే లక్ష్యంగా ఆ సంఘం సీనియర్ నాయకుడు ఉత్తంచంద్ అన్నారు. బుధవారం సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరులో ముదిరాజ్‌ల సంఖ్య ఎక్కువగా ఉందని, సంఘం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భవన నిర్మాణానికి ఇప్పటికే స్థల కేటాయించారని అన్నారు. నిర్మాణ పనులు మాత్రమే మిగిలాయని తెలిపారు. ఇందుకు, ప్రతిగ్రామం నుంచి తమ వంతుగా సహాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సైతం ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన యాలాల డైరెక్టర్ శ్రీనివాస్, మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌లను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ సాయిలు, సంఘం సభ్యులు అమృతప్ప, వీరేశం, నర్సింహులు, అశోక్, వెంకట్, గిరిజాపూర్ లక్ష్మయ్య, తిరుపతి, లాలప్ప ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొడంగల్ రూరల్: వీరశైవ సమాజం నియోజకవర్గ, మండలాల నూతన కార్యవర్గాలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా కొడంగల్ జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతులు శ్రీసిద్ధలింగ మహాస్వామి, శ్రీపశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం పీఠాధిపతులు పంచమ సిద్ధిలింగ మహాస్వామి, కర్నాటకలోని జాకన్‌పల్లి మఠం పీఠాధిపతులు అభినవ గవి సిద్ధిలింగేశ్వర మహాస్వామిల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీలను ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా శ్రీజగద్గురు సిద్ధిలింగ మహాస్వామి నిరంజన మఠం కొడంగల్, గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, అధ్యక్షుడిగా కోపూరు విజయవర్ధన్, ఉపాధ్యక్షుడిగా బర్ల శ్రీశైలం, ఆవుటి సోమయ్య, కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దౌల్తాబాద్ మల్లేశ్, కార్యదర్శుగా శరణయ్య, భరత్ కుమార్, పి.శివశంకర్, సిద్ధప్ప, కోశాధికారిగా రాకేష్, సహాయ కోశాధికారిగా బాలశివుడులతో పాటు కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు, న్యాయ సలహాదారులను ఎన్నుకున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాములు యాదవ్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మర్పల్లి: రోడ్డు మరమ్మతుల పనులు నాణ్యతగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం రాములు యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఫసితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచి సంగారెడ్డి జిల్లా సరిహద్దు కొంషెట్‌పల్లి వరకు మరమ్మతుల పనులు చేయనున్నారు. సదరు కాంట్రాక్టర్ రోడ్డు నాణ్యత ప్రమాణాలను పాటించి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రూ. 3 కోట్లు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సలీం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాచన్న, రవివర్మ, రథన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్ ఉన్నారు.

సాగు వివరాల నమోదు తప్పనిసరి

వికారాబాద్ ఏడీఏ స్వరూప



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ స్వరూప

మర్పల్లి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలు సక్రమంగా ఉండాలని వ్యవసాయ శాఖ వికారాబాద్ ఏడీఏ స్వరూప సిరిపురం రైతు వేదిక క్లస్టర్ ఏఈఓ మహేష్‌ను ఆదేశించారు. తేడాలుంటే రైతులకు ఇబ్బందిగా మారనుందన్నారు. బుధవారం సిరిపురం రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని సిరిపురం, కోత్లాపూర్, వీర్లపల్లి గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పత్తి, పెసర, మినుము, కంది, సోయాబీన్ వంటి పంటల సాగును ఆమె పరిశీలించారు. అలాగే, ఇంతకుముందే ఏఈఓ మహేష్ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంట వివరాలను చెక్ చేశారు. దీంతో రైతులు సాగు చేసిన పంటల వివరాలు సక్రమంగా ఉండటంతో స్వరూప సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పత్తి, పెసర, మినుము, కంది పంటలు సాగు చేసిన రైతులకు పంటల సాగుపై పలు సూచనలు, మెళకువలు వివరించారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పత్తి పంటలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. పత్తికి పైపాటు ఎరువులు వేయొద్దన్నారు. కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ మహేష్, రైతులున్నారు.

రుణమాఫీ కోసం రైతుల పాట్లు

వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



మోమిన్‌పేట రైతు వేదికలో రైతులు



దౌల్తాబాద్: ఏఈఓతో మాట్లాడుతున్న రైతులు

దౌల్తాబాద్: మూడు విడతల్లో రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జులై 18, 30, ఆగస్టు 15న మూడు విడతల్లో రుణమాఫీ చేసింది. ఇందులో లక్ష, లక్షన్నర లోపు మాఫీ కాని రైతులకు మూడోసారి సమస్య పరిష్కారమవుతోందని అప్పట్లో అధికారులు చెప్పారు. మూడోసారి కూడా కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తమకు ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారులను నిలదీస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాలు మ్యాచింగ్ కాకపోవడం, ఒకే కుటుంబంలో రెండు లక్షల కంటే ఎక్కువ రుణం పొందడం, కుటుంబ నిర్ధారణ, తదితర కారణాల వల్ల మాఫీ కాలేదంటూ రైతులకు అధికారులు నచ్చచెబుతున్నారు. తిరిగి కొత్తగా లబ్ధి పొందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయినప్పటికీ రుణమాఫీ అవుతుందో లేదోనని అన్నదాతలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

నాకెందుకు మాఫీకాలేదు సార్..!

మోమిన్‌పేట: సార్.. నాకెందుకు మాఫీ కాలేదు జర చూడండి సార్.. అంటు ఒక రైతు...సార్ నేను రూ.60వేలు మాత్రమే తీసుకొన్న నాకు కూడా మాఫీ వర్తించలేదు ఎందుకు సార్.. అంటు రైతులు రైతు వేదిక క్లస్టర్లకు క్యూ కడుతున్నారు. వ్యవసాయ పనులు మానుకొని బ్యాంకుకు వెళ్లితే బ్యాంకు అధికారులు మాకు తెలవదు.. వ్యవసాయ అధికారులను అడగండని చెప్పడంతో రైతు వేదికలకు పరుగులు తీస్తున్నారు. కుటుంబంలో ఎన్ని ఖాతాలున్నా రూ.2లక్షల వరకే మాఫీ చేస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో అపై ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది రైతులకు రూ.2లక్షల లోపు ఉన్న మాఫీ కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డుతో కుటుంబ సభ్యులను గుర్తించడం, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకంలో ఉన్న వివరాలు సరిపోలకపోవడం, కొన్ని ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసినప్పుడు ఒకరి ఖాతాకు బదులు ఇంకొకరి ఖాతాకు అనుసంధానం కావడంతో మాఫీ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

ఏడీఏ స్వరూప

బంట్వారం: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ ఏడీఏ స్వరూప అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రుణమాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ. 2లక్షల లోపు ఉన్న రైతులందరికీ మూడో విడత రుణమాఫీ చేసిందన్నారు. అయినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల మిగిలిపోయిన రైతులకు తప్పకుండా మాఫీ వస్తుందన్నారు. రూ.2లక్షలకు పైబడిన రైతులందరికీ 30వ తేదీ నాటికి డబ్బు జమ అవుతుందన్నారు. సందేహాలు ఉంటే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మశ్చందర్, అశ్విని, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ప్లాట్ల పరిశీలనకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల స్థలాలను పరిశీలించారు. ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు 405మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరిశీలనకు అధికారులు వచ్చే సమయంలో లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందాను అరికట్టాలి

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలో జోరుగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ లారీ, డీసీఎంల్లో కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అక్రమ దందాను అరికట్టేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్తజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుల్షన్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

నారాయణరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

పరిగి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి(85), అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన అంత్యక్రియాలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హాజరై, భౌతికాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణరెడ్డి గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. ఆయన చేసిన సేవలను పార్టీ ఎల్లప్పుడు గుర్తించుకుంటుందన్నారు.

నేడు రుణమాఫీపై ధర్నా

పరిగి: రైతులందరికీ రుణమాఫీ చేయాలని నేడు(గురువారం) పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ. 9:30కు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ధర్నా చేయనున్నట్లు చెప్పారు. కావునా, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గృహజ్యోతికి ఎడిట్ ఆప్షన్

దౌల్తాబాద్: గృహజ్యోతి పథకం ఇక అర్హులందరికీ వర్తించనుంది. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను గృహజ్యోతి ద్వారా ఉచితంగా పొందే అవకాశం ప్రభుత్వం కల్పించగా ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీలో తప్పిదాల కారణంగా అనేక మందికి వర్తించలేదు. ప్రస్తుతం ఈ పథకం పొందని వారి కోసం ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. దీంతో రెండు రోజుల నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రంలో దరఖాస్తులను సరిచేస్తున్నారు. పథకం పొందని అర్హులైన వారంతా ప్రజాపాలన దరఖాస్తు రశీదు, కరెంట్‌బిల్లు రశీదు, ఆధార్‌కార్డు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలని మండల విద్యుత్ ఏఈ మహిపాల్ కోరారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



రాజును సన్మానిస్తున్న నాయకులు

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్ మేకల రాజును బుధవారం పులువురు యువ నాయకులు సన్మానించారు. బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకులు ప్రకాష్, శ్రీనివాస్ డైరెక్టర్ రాజు ఇంటికి వెళ్లి పూలమాల శాలువాతో సన్మానించారు. రాజు భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకొని వారు అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

ఓటు హక్కు నమోదుకు చర్యలు

ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: గ్రామాల్లో ఓటుహక్కు లేని వారిని గుర్తించి, వారికి ఓటు హక్కు కల్పించేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం దోమ మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని 18 సంవత్సరాల యువతీ, యువకులు ఓటు హక్కుకు అర్హులన్నారు. ప్రతి ఒక్కరు బీఎల్‌ఓల ద్వారా లేక ఆన్‌లైన్‌లో నమోదును చేసుకోవాలని చెప్పారను. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని, ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అనుబంధాలకు 'రక్ష'



రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

కుల్కచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలో గ్రామయువత బుధవారం రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు బాల్యం నుంచే మన సనాతన ధర్మం, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బంధుత్వాలు, అనుబంధాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీను, నరేందర్, విష్ణు, సతీష్, గోవర్ధన్, కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తప్పులు సరిచేసుకోండి

తహసీల్దార్ విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ రూరల్: ఓటరు జాబితాలో తప్పొలను సరిచేసుకోవాలని తహసీల్దార్ బి.విజయకుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో 45రోజుల పాటు ఓటరు జాబితాలో తప్పులను సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా బిఎల్‌ఓలు పరిశీలించనున్నట్లు చెప్పారు. అనంతరం పోలింగ్ కేంద్రాల మార్పులపై పార్టీల నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.